సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



అనాథ పిల్లలపై వాత్సల్యం
అనాథ పిల్లలకు నెలకు రూ. 4 వేలు సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. -8లో..



హాకీ చిరుతలు
కడపలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాల విద్యార్థులు ఆలిండియా సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.88	రూ.118
రెండోరకం	రూ.54	రూ.84



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 248 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	355	576
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 911.54 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
రాజంపేట	6.32	4.50
రాయచోటి	6.33	4.47
మదనపల్లి	6.33	4.50
పీలేరు	6.29	4.45

న్యూస్‌రీల్

నేడు స్పందన

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం: కేంద్ర ప్రాయోజిత పథకం కింద మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ భారతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు రక్షణ లేదా సంరక్షణ అవసరమైన పిల్లల కుటుంబాలు పిల్లలకు ఆర్థిక, వైద్య, విద్య, అభివృద్ధి అవసరాలను తీర్చడానికి అనుబంధ మద్దతును అందించడం కోసం కేంద్ర ప్రాయోజిత పథకం మిషన్ వాత్సల్య కింద స్పాన్సర్‌షిప్‌కు షరతులతో కూడిన సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ స్పాన్సర్‌షిప్ ద్వారా పిల్లలకు నెలకు రూ.4వేలు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు శిక్షణ

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి హరికృష్ణ, ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్ వారు ఈ మేరకు ఒక ప్రకటనల విడుదల చేశారు. ఏప్రిల్ 3వ వారం నుంచి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లమా విద్యార్హతలు కలిగిన జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9553202509 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మట్టల ఆదివారం విశిష్టమైనది



ఈత మట్టలు పట్టుకొని ఉన్న క్రైస్తవులు

సిద్దవటం: దిగువపేటలోని గ్రేస్ ప్రార్థనా మందిరంలో ఆదివారం మట్టల పండుగను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ యోహాను మాట్లాడుతూ క్రైస్తవులకు మట్టల ఆదివారం ఎంతో ప్రత్యేకం, విశిష్టమైనదన్నారు. ఏసుక్రీస్తు శిలువలో చనిపోక ముందటి ఆదివారం యూదుల రాజుగా గాడిద మీద ఆయన్ను ఊరేగించారన్నారు. ఆ క్రమంలో అప్పటి ప్రజలు రోడ్ల వెంబడి ఈత మట్టలు పరిచి వాటిమీద వస్త్రాలను పరిచి యూదుల రాజు జై అని కేకలు వేస్తూ పట్టణంలోనికి ఏసును ఆహ్వానించారన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఈత మట్టలను చేతపట్టుకొని ప్రత్యేక గీతాలను ఆలపిస్తూ పురవీధుల గుండా తిరిగారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు, సంఘ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

8న బీటీ కళాశాలలో రాజ్యాంగ రక్షణ భేరి

మదనపల్లె : పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీసీకే పార్టీ ఆధ్వర్యంలో 8వ తేదీన రాజ్యాంగ రక్షణ భేరి సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక రాజ్‌భవన్ ఫంక్షన్ హాల్‌లో రాజ్యాంగ రక్షణభేరి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, అడ్వకేట్స్, ప్రజాసంఘాలు, ఆర్‌జీఎస్, ఉద్యోగసంఘాలు, భారతీయ అంబేద్కర్ సేన ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధునిక స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవం ప్రారంభించి దేశపౌరులందరికీ కుల,మత, లింగ ప్రాంత, భాష, భేదం లేకుండా మానవహక్కుల కోసం పోరాడి రాజ్యాంగబద్ధం చేసిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు.

మూగ మనసు మాకు తెలుసు!

SAKSHI SPECIAL

- వేసవిలో మూగ జీవుల దాహార్తి తీరుస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- వాటర్ బౌల్ పేరుతో వినూత్న ఆలోచన
- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న సేవానిరతి



దాహార్తి తీర్చుకుంటున్న శునకం



వాటర్‌బౌల్‌లో నీటిని నింపుతున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: వేసవి వచ్చిందంటే చాలు నీటి చుక్క కోసం అల్లాడిపోతాం. కాలు బయట పెడితే.. కాసిన్ని నీళ్లు ఎక్కడ దొరుకుతాయా అని ఆశతో వెదుకుతుంటాం. ఎప్పటికప్పుడు ఉష్ణ తాపాన్ని తీర్చుకునేందుకు ఏదో రూపంలో నీటిని శరీరానికి అందిస్తుంటాం. అందుకే వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చాలా చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మరి మూగజీవాల పరిస్థితి ఏమిటి? చుక్క నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి. పక్షి జాతుల్లో కొన్ని అంతరించిపోవడానికి వేసవి ఒక కారణమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఏమీ చేయాలేమా? అని హెల్పింగ్‌మైండ్స్ సంస్థ, గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమ నిర్వాహకులు ఆలోచించారు. వారి మదిలో మెదిలిన ఆలోచనను ఆచరణలో పెట్టారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో వేలాది పశుపక్ష్యాదుల దాహార్తిని తీరుస్తున్నారు. సాధారణంగా పక్షుల శరీర సాధారణ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్. ఈ ఉష్ణోగ్రత దాటితే ఎక్కువ సేపు జీవించలేవు. అందుకే చాలా పక్షులు ఎక్కడ నీరు కనిపిస్తే అందులో మునకేస్తూ శరీర ఉష్ణోగ్రతను తగ్గించుకుంటాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో జంతువులు, పక్షుల రక్షణకు నడుం బిగించారు హెల్పింగ్‌మైండ్స్, సచ్చిదానంద ఆశ్రమం నిర్వాహకులు. సేవేమార్గంగా వాటర్‌బౌల్ ప్రాజెక్టును ప్రారంభించారు.

25 తొట్టెలతో ప్రారంభమై..

పశుపక్ష్యాదులను వేసవి తాపం నుంచి రక్షించి వాటి దాహార్తి తీర్చే ఉద్దేశంతో 2018 లో వాటర్‌బౌల్ పేరుతో మదనపల్లెకు చెందిన హెల్పింగ్‌మైండ్స్ సంస్థ సామాజిక ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలి ఏడాది నుంచి సభ్యులు, దాతల సహకారంతో మదనపల్లె-బెంగళూరు రోడ్డు, కురబలకోట మండలం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఫారెస్టు రోడ్డు ప్రాంతాల్లో వాటర్‌బౌల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సుమారు 50కిపైగా తొట్టెలను ఏర్పాటు చేశారు. వీటిని ట్యాంకర్ల సాయంతో తరచూ నీటితో నింపుతున్నారు. ఫారెస్టులోని నెమళ్లు, దుప్పిలు, జింకలు, పావురాలు, కోయిలలు, కోతులు, కుక్కలు, కాకులు వాటర్‌బౌల్స్ వద్దకు వచ్చి దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఈ వాటర్‌బౌల్స్ వద్దకు పక్షులు, మూగజీవాలు వచ్చి నీటిని తాగుతుండటం చూసి నిర్వాహకుల గొప్ప మనసును అభినందిస్తున్నారు. తాము ఈ వాటర్‌బౌల్ ప్రాజెక్టులో భాగస్వాములమవుతామని ముందుకు వస్తున్నారు.

వాటర్‌బౌల్స్ వితరణ

స్థానిక బొమ్మనచెరువు వద్ద ఉన్న గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమ నిర్వాహకులు గత రెండేళ్లుగా భక్తులకు వాటర్‌బౌల్స్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. బౌల్స్‌లో మంచి నీళ్లు నింపి ఇంటి ముందు, పరిసర ప్రాంతాల్లో పక్షులకు అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నారు. దీంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో వేసవిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



గణపతి సచ్చిదానంద ఆశ్రమ నిర్వాహకులు అందజేసిన వాటర్‌బౌల్స్‌తో భక్తులు (ఫైల్)

ఉచితంగా అందిస్తాం



వేసవిలో మూగ జీవాల దాహం తీర్చేందుకు మా సంస్థ వాటర్‌బౌల్ ప్రాజెక్టును ప్రారంభించింది. మూగజీవాలను ప్రేమించే వారు ఎవరు వచ్చినా ఉచితంగా బౌల్స్ అందజేస్తాం.
–అబుబకర్ సిద్దిక్, హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు, మదనపల్లె

పేద విద్యార్థులకు ఉచిత ప్రైవేటు విద్య

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



గిరీషా పీఎస్, కలెక్టర్

రాయచోటి: పేద విద్యార్థులకు ఉచిత ప్రైవేటు విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉచిత నిర్బంధ హక్కుచట్టం 12(1)(సి) ప్రకారం 2023–24 విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో ఐబి, ఐసీఎస్ఈ, సిబీఎస్ఈ స్టేట్ సిలబస్‌లను అమలు చేస్తున్న అన్ని ప్రైవేటు అన్ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు 25శాతం ఉచిత ప్రవేశాలను కల్పించాలన్న ఆదేశాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. 25శాతం సీట్లలో అనాథ బాలలు, వికలాంగులు, హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు చెందిన పిల్లలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, ఓసీ, మైనార్టీ వర్గాలలోని నిరుపేదలకు 6శాతం కేటాయించామన్నారు. జిల్లాలో 350 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, 2295 మందికి పైగా పేద విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందే అవకాశం ఉందన్నారు. అర్హులైన విద్యార్థులు ప్రవేశాల కోసం ఈనెల 10వ తేదీ లోపు www.cse.ap.gov.in/RTE వెబ్‌సైట్‌లో లేదా అలాగే సమీపంలో ఉన్న గ్రామ సచివాలయంలో దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కట్టుదిట్టంగా పది పరీక్షలు


- పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలి
- జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం



శ్రీరాం పురుషోత్తం, డీఈఓ

మదనపల్లె సిటీ: పదోతరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ యాజమాన్యాల కింద 22,395 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి 16 సిట్టింగ్, 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల సౌకర్యార్థం వైద్య సిబ్బందిని నియమించామన్నారు. అన్ని కేంద్రాల్లో బల్లలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్ వెంట తీసుకురాకూడదన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.45 వరకు ఉంటుందన్నారు. విద్యార్థులను 8.30 తర్వాత నుంచి కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేరకు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని వివరించారు.

కనుల పండువగా రథోత్సవం



రథంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు (ఇన్‌సెట్) విశేష అలంకరణలో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు

వాల్మీకిపురం: వాల్మీకిపురంలోని పట్టాభిరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. సీతా, లక్ష్మణ సమేత శ్రీరాముడు రథంపై తిరుమాఢ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా భక్తులు జై శ్రీరామ్ జయజయరామ్ అంటూ భక్తిపూర్వకంగా శ్రీరామనామాన్ని ఉచ్చరించారు. డప్పు, వాయిద్యాలు, భజన బృందాలు, కోలాటాలు, సంకీర్తనల నడుమ కోలాహలంగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి మూలవర్లకు తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర కార్యక్రమాలు జరిపారు. రథోత్సవం అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనం, కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం, 10 నుంచి స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి ఊంజల్ సేవ, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారి పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు.

మముబ్రోవుమోయి.. వటపత్రశాయి

మూడో రోజు చూడ ముచ్చటగా కోదండరాముని బ్రహ్మోత్సవం



వటపత్రశాయి అలంకారంలో మాఢ వీధుల్లో ఊరేగుతున్న రఘురాముడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజు ఆదివారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామి వారు పురవీధుల్లో విహరించారు. గ్రామోత్సవం అనంతరం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె చందనంతో శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన కోదండ రాముల వారి ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. తిరిగి సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా జరిగింది.

సింహవాహనంపై..

ఆదివారం రాత్రి సింహ వాహనంపై సీతాపతి ఊరేగారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. ఉదయం నిద్రలేవగానే దర్శించే వస్తువుల్లో 'సింహ దర్శనం' అతి ముఖ్యమైంది. సోమరితం నశించి, పట్టుదలతో ప్రవర్తించి సర్వత్రా విజయులమై ఆధిపత్యంతో రాణించే స్ఫూర్తి సిద్ధిస్తుందని నమ్మకం. ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కోదండరాముడి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు



కోదండ రామాలయం పరిసరాలను పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ, కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న జరగనున్న సీతారాముల కల్యాణానికి జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టామని టీటీడీ ఈఓ ఎ.వి.ధర్మారెడ్డి, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఆదివారం టీటీడీ ఈఓ, వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌తో పాటు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు విభాగాల వారీగా జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కల్యాణ వేదిక వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ కల్యాణం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. కల్యాణ వేదిక వద్ద భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే ముందే ముత్యంతో కూడిన తలంబ్రాలు, పసుపు కుంకుమ, అన్నప్రసాదం ప్యాకెట్ అందిస్తామని చెప్పారు. భక్తుల కోసం తగినన్ని మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుతామన్నారు. వీరి వెంట టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, అదనపు ఎస్పీ కృష్ణారావు, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి, మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండికోట జలాలతో తాగునీటి సమస్య పరిష్కారం

- నాలుగు నియోజకవర్గాలకు వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీటి సరఫరా
- రూ.2375 కోట్లతో టెండర్లు పూర్తి
- త్వరలోనే పనులు ప్రారంభం
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



సంగసముద్రంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలసి ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

గుర్రంకొండ: గండికోట జలాశయం నీటితో గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సంగసముద్రం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకొన్న ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలకు వైఎస్సార్ జిల్లాలోని గండి కోట జలాశయం నుంచి వాటర్ గ్రిడ్ పనుల ద్వారా తాగునీటిని అందిస్తామన్నారు. ఇందుకోసం రూ. 2375 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. తద్వారా జిల్లాలోని 21 పడమటి మండలాలతో పాటు మదనపల్లె, పుంగనూరు మున్సిపాలిటీలకు ఇంటింటి కొళాయిల ద్వారా తాగునీటిని అందిస్తామన్నారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు.

కియోస్కోతో రైతులకు ఉపయోగం

కియోస్కో యంత్రంతో రైతులకు ఎంతో ఉపయోగమని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంగసముద్రంలోని ఆర్బీకేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఆర్బీకేలు సీఎం మానస పుత్రికలు అన్నారు. కియోస్కో యంత్రం ద్వారా రైతులు ఎరువుల కొనుగోలు, డబ్బుల చెల్లింపులు చేపట్టవచ్చన్నారు. తమ సొంత గ్రామాల నుంచే వారికి కావాల్సిన ఎరువులను తీసుకోవచ్చన్నారు. ఇదంతా జగనన్న కలలుకన్న రైతు రాజ్యమే అని పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణానికి గోటితలంబ్రాలు



ఆలయ ఇన్‌స్పెక్టర్‌కు గోటితలంబ్రాలను అందజేస్తున్న మహిళలు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఏప్రిల్ 5న నిర్వహించే సీతారాముల కల్యాణానికి విజయవాడ కృష్ణలంకకు చెందిన భక్తవత్సల సేవా సమితి ప్రతినిధి ధనలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 40 కేజీల గోటి తలంబ్రాలను ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడుకి అందజేశారు. రామయ్యపై భక్తి భావంతో వడ్లను గోటితో ఒలిచినట్లు వారు తెలిపారు.

క్లుప్తంగా

మహాభారతం బొమ్మల ఊరేగింపు



చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామం మల్లారమ్మ ఆలయ సమీపంలో ఈ నెల 6 నుంచి మహాభారత యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మహాభారతం బొమ్మలను కొత్తపల్లె గ్రామంలో ఆదివారం ఊరేగింపు చేశారు. ఈ నెల 6 నుంచి జరగబోయే మహాభారత కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కురబలకోట మండలం సింగన్నగారిపల్లెకు చెందిన శంకర్(50) అనే రైతు ఆదివారం ద్విచక్రవాహనంలో పొలం వద్దకు బయలుదేరాడు. దారిలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనింది. ప్రమాదంలో శంకర్ సహా మరో వాహనదారుడు అదే ఊరికి చెందిన బాలాజీ(40)తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ వైర్లు తెగిపడి తోట దగ్ధం



కాలిపోయిన మామిడి చెట్టు

అట్లూరు : ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్ వైర్లు తెగిపడి మామిడితోట దగ్ధమైన సంఘటన అట్లూరు మండలంలోని కమలకూరు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమలకూరు గ్రామంలోని ముడమాల నరసింహారెడ్డికి చెందిన మామిడితోట మీదుగా వలసపాలెం గ్రామానికి 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తోంది. ఆ లైన్ ప్రమాదకర పరిస్థితిలో ఉండడంతో బాధిత రైతు పలుమార్లు లైన్‌మ్యాన్, జూనియర్ లైన్‌మ్యాన్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు స్పందించలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 కేవీ విద్యుత్ వైర్లు తెగి మామిడి తోటపై పడడంతో మంటలు చెలరేగాయి. కాయలతో ఉన్న మామిడి, సపోట, ఉసిరిక చెట్లు సుమారు 50 వరకు అగ్నికి ఆహుతి అయ్యాయి. డ్రిప్ పైపులైన్ కూడా కాలి బూడిద అయిందని బాధిత రైతు నరసింహారెడ్డి వాపోయాడు. అధికారులు స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని ఆయన కోరాడు.

అనాథ పిల్లలపై 'వాత్సల్య'ం

- నిరుపేద నిస్సహాయ స్థితిలో ఉన్న 18 ఏళ్లలోపు వారు అర్హులు
- నెలకు రూ.4 వేల చొప్పున సాయం
- కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ
- సర్వే నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



సర్వే నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్త

కడప కోటిరెడ్డిసర్కిల్ : అనాథలు, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు నెలకు రూ. 4 వేలు సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. 2019 కోవిడ్ సమయంలో తల్లిదండ్రులు మృతి చెంది ఎంతో మంది పిల్లలు అనాథలు, అభాగ్యులుగా మారడంతో.. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు స్పాన్సర్‌షిప్‌ను ప్రవేశపెట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా జిల్లా బాలల రక్షణ విభాగం ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తున్నాయి. ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.2400 అందజేస్తే, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1600 ఇస్తోంది. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాల సంరక్షణ, ఆదరణ అవసరమైన పిల్లలు.. వారి తల్లిదండ్రుల రక్త సంబంధీకులు సంరక్షకులతో నివసిస్తూ విద్యను కొనసాగించేందుకు స్పాన్సర్‌షిప్‌ను మంజూరు చేస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

వాత్సల్య పథకం కింద అనాథ పిల్లలు దరఖాస్తు చేసుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హులైన పిల్లల కోసం అంగన్వాడీ కార్యకర్తలు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు బాధ్యతలు అప్పగించారు. చైర్ పర్సన్‌గా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి, సీడబ్ల్యూసీ అధికారి, డీసీపీఓ, ఎస్‌ఐసీ పీఓ, శిశు గృహ సంక్షేమాధికారి, ఒక ఎన్జీఓ అధికారి, సభ్యుల పర్యవేక్షణలో అర్హుల ఎంపిక జరుగుతుంది.

అర్హులు వీరే

- వితంతు, విడాకులు తీసుకున్న తల్లీపిల్లలు
- తల్లిదండ్రులు కోల్పోయి ఇతర కుటుంబాల్లో నివసిస్తున్న అనాథ పిల్లలు
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు
- పిల్లలను పెంచలేని స్థితిలో ఉన్న వారి బాలలు
- బాల న్యాయ (రక్షణ, ఆదరణ చట్టం) 2015 ప్రకారం ఆదరణ అవసరమైన చిన్నారులు
- బాల కార్మికులు, బాల్య వివాహాల అక్రమ రవాణాకు గురైన వారు
- హెచ్ఐవీ బాధితుల పిల్లలు
- వికలాంగులు, తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు, యాచకుల పిల్లలు, వీధుల్లో నివసిస్తున్న పిల్లలు, హింసకు, దోపిడీకి గురైన పిల్లలు, అనాథ ఆశ్రమాల్లో ఉన్న బాలలు
- పీఎంకేర్ ఫర్ చిల్డ్రన్ పథకం పొందుతున్న చిన్నారులు
- కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 96 వేలు మించరాదు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్పాన్సర్ షిప్ ఇచ్చేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలి. సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులను కలిసి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి.

- ఎంఎన్ రాణి, ఐసీడీఎస్ పీడీ, కడప

బలిజపల్లె జాతర ఉంటుందా? లేదా?

- జాతర కోసం ఎదురుచూస్తున్న ప్రజలు
- రెండు కుటుంబాల మధ్య వివాదమే కారణం



బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లె గ్రామంలో స్వయంభుగా వెలసిన గంగమ్మ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకుంది. కరోనా సమయంలో మినహా ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే ఇక్కడి జాతరకు దాదాపు రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. అంతేకాక జిల్లాలో రెండవ పెద్దజాతరగా కూడా బలిజపల్లె గంగమ్మ జాతర ప్రసిద్ధి గాంచింది. ఈ జాతరలో లక్షమందికి పైగా భక్తులు పాల్గొంటారు. జిల్లా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులే కాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. జాతరకు ఇంతటి ఘన చరిత్ర ఉన్నప్పటికీ.. అమ్మవారికి సమర్పించే సాంగ్యాల విషయంలో రెండు కుటుంబాల మధ్య తలెత్తిన వివాదం కారణంగా ఈ ఏడాది ఎప్పుడు నిర్వహిస్తారనే విషయం ఇంకా తేలలేదు. దీంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. జాతర నిర్వహణలో బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలకు భాగస్వామ్యం ఉంది. అయితే ఈ మూడు గ్రామాలకు చెందిన నిర్వాహకులు కూడా ఎలాంటి చొరవ చూపక పోవడంతో.. ఆ గ్రామాల్లోని ప్రజలు, అమ్మవారి భక్తులు వారి తీరుపై పెదవి విరుస్తున్నారు. నిర్వాహకులు ఇరు కుటుంబాల వారికి సర్ది చెప్పలేకుంటే.. గత ఏడాదిలాగే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి జాతర నిర్వహణకు కృషి చేయాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

ఆగిన చాటింపు కార్యక్రమం

ఉగాదిలోపు జాతర జరగకుంటే ఉగాది తరువాత మంచి తిథుల్లో బేసి సంఖ్యల్లో వచ్చే ఆదివారం అంకురార్పణ చేసి.. ఆ తరువాత వచ్చే గురువారం జాతర నిర్వహిస్తారు. అయితే రెండు కుటుంబాల మధ్య తలెత్తిన వివాదం కారణంగా ఉగాది పర్వదినాన సంప్రదాయబద్ధంగా వేయించాల్సిన చాటింపు కార్యక్రమం కూడా ఆగిపోయింది. చాటింపు ఆగిపోయినా నిర్వాహకులు జాతర అయినా చేస్తారని అనేక మంది భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. అంతేకాక పలువురు ఇక్కడి ప్రజలు ఒక అడుగు ముందుకేసి తేదీ ఖరారు కాగానే చెబుతామని జాతరకు రావాలంటూ ఇతర ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులకు ఇప్పటికే ఆహ్వానించడం కూడా ప్రారంభించారు. ఇప్పటికైనా మూడు గ్రామాలకు చెందిన నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరాటేతో ఆరోగ్యం, ఆత్మరక్షణ



కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో సినీ హీరో భానుచందర్

పీలేరు : కరాటేతో ఆరోగ్యంతోపాటు ఆత్మరక్షణ లభిస్తుందని సినీ హీరో భానుచందర్ అన్నారు. ఆదివారం స్థానిక కేఆర్‌కే కల్యాణ మండపంలో ఇండియా ఓపెన్ జేకేడీ కుంగ్‌ఫూ కరాటే దూ చాంపియన్‌షిప్–2023 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్ర, కేరళ, తెలంగాణా, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ హీరో భానుచందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కరాటేపై ఆసక్తి చూపాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు కరాటేపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో మొత్తం 600 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, కరాటే మాస్టర్ దామోదర్, ఆర్గనైజర్ సయ్యద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

175 సినిమాల్లో నటించా..

తెలుగు, కన్నడ, మళియాలం, తమిళంలో మొత్తం 175 చిత్రాల్లో నటించినట్లు హీరో భానుచందర్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తలకోన, నెరబైలు ప్రాంతాల్లో యముడు, మెరుపుదాడి లాంటి హిట్ సినిమాలు తీసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగులో వార్‌మెన్, ర్యాపిడ్ యాక్షన్ మిషన్, మ్యూజిక్ షాప్ రామ్మూర్తి సినిమాల్లో నటిస్తున్నట్లు చెప్పారు.

ఎంఐజీ లేఔట్‌లో అభివృద్ధి పనులు



డబుల్ రోడ్డు భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్–మధ్య తరగతుల లేఔట్ శోభను పెంచేలా రోడ్డు నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను చేపడుతామని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం బైపాస్ రోడ్డులోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఎంఐజీ లేఔట్‌కు వెళ్లే దారిలో 2.9 కి.మీ. మేర రూ.9.70 కోట్లతో డబుల్ లైన్ తారురోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం అభివృద్ధిలో స్మార్ట్ టౌన్‌షిప్ ఒక కలికితురాయిలా ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. టౌన్‌షిప్‌లో 400 ప్లాట్లు ఏర్పాటు కానున్నాయన్నారు. రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మండల బీసీ నాయకులు పల్లపు రమేష్, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, అమాడ వైస్ చైర్మన్ వైఓ నందన్, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, పబ్లిక్ అండ్ హెల్త్ డీఈఈ సతీష్, ఏఈఈ సుబ్బరాయుడు, మునిసిపల్ ఆర్ఐ మల్లికార్జున, వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ జిల్లా చైర్మన్ బేపారి మహమ్మద్‌ఖాన్, సర్పంచ్ తిరుపాల్‌నాయుడు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితుడి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం : బాలికను గర్భవతిని చేసిన కొత్తపల్లి నరసింహులుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. మండలంలోని కందుకూరులో 9వ తరగతి చదివే బాలిక రెండు రోజుల క్రితం బి.కొత్తకోట సీహెచ్‌సీలో ఓ మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో బాధిత బాలిక ఫిర్యాదు మేరకు మదనపల్లి డీఎస్పీ కేశప్ప ఇదే గ్రామానికి చెందిన కొత్తపల్లి నరసింహులు (26)పై పోక్సో చట్టం కేసు నమోదు చేశారు. డీఎస్పీతోపాటు ములకలచెరువు సీఐ సాదిక్ అలీషా, ఎస్ఐ మధురామచంద్రుడు, పోలీస్ సిబ్బంది గ్రామంలో సమగ్రంగా విచారణ చేపట్టారు. అనంతరం శనివారం రాత్రి నిందితుడిని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దళితుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమం



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు

రాయచోటి అర్బన్ : దళితుల హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా ఉద్యమించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దళిత హక్కుల పోరాట సమితి అన్నమయ్య జిల్లా మహాసభలు జరిగాయి. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు మండెం సుధీర్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ దళిత రక్షణ చట్టాలను పటిష్టంగా అమలుచేయడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, డీహెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మండెం సుధీర్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా లభిస్తున్న రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దళితులు పాల్గొన్నారు.

హాకీ చిరుతలు

జాతీయ స్థాయిలో కాంస్యంతో మెరిసిన క్రీడాకారిణులు

సామాన్య మధ్యతరగతికి చెందిన కుటుంబాల్లోని విద్యార్థినులు.. క్రీడల్లో పతకాల సాధనే ధ్యేయంగా వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలు పొంది.. అనతికాలంలోనే జాతీయ స్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని దేశ వ్యాప్తంగా చాటి చెబుతున్నారు. బరిలోకి దిగితే చిరుతల్లా ప్రత్యర్థులకు చుక్కలు చూపించే హాకీ చిరుతలపై ప్రత్యేక కథనం.

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ఇటీవల జరిగిన ఆలిండియా జూనియర్ సౌత్‌జోన్ హాకీ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో సత్తా చాటారు. బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు మూడో స్థానంలో నిలిచి, కాంస్యపతకం సాధించడంలో వీరు కీలకంగా వ్యవహరించారు. వైఎస్ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె గ్రామానికి చెందిన టి.కావ్య, జి.నందిని, ప్రకాశం జిల్లాకు చెందిన పి.ముజియాబేగం సబ్‌జూనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. మార్చి 19 నుంచి 26వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని రామనాథపురంలో నిర్వహించిన హాకీ ఇండియా జూనియర్ ఉమెన్ సౌత్‌జోన్ హాకీ చాంపియన్‌షిప్–2023లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఉత్తమ ప్రదర్శన చేసి మూడోస్థానంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో కేరళ జట్టుపై ఏపీ జట్టు 9–0 గోల్స్ తేడాతో విజయం సాధించడంలో జిల్లా క్రీడాకారిణులు కీలకంగా వ్యవహరించారు. వైఎస్ఆర్ క్రీడా పాఠశాల హాకీ శిక్షకుడు ఖాదర్‌బాషా శిక్షణలో క్రీడాకారిణులు జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తుండటం పట్ల క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్.బాషామోహిద్దీన్ అభినందనలు తెలిపారు.



పాంచ్.. పటాకా.. కావ్య..

జాతీయస్థాయి జూనియర్ ఉమెన్ చాంపియన్‌షిప్‌లో పుదుచ్చేరి జట్టుపై మూడు గోల్స్, కర్ణాటకపై 1, కేరళపై 1 గోల్ సాధించి.. మొత్తం 5 గోల్స్ కొట్టింది. మ్యాచ్‌లో రైట్ పొజిషన్‌లో ఆడుతూ జట్టుకు వెన్నెముకలా నిలుస్తోంది.

నందిని.. నాలుగు గోల్స్..



జాతీయస్థాయి జూనియర్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో నందిని లెఫ్ట్ హాఫ్ పొజిషన్‌లో రాణిస్తూ నాలుగు గోల్స్‌తో రాణించింది. పుదుచ్చేరి జట్టుపై 3 గోల్స్, తెలంగాణపై 1 గోల్ చేసి మొత్తం నాలుగు గోల్స్ సాధించింది.

ముచ్చటైన ఆట.. ముజియా..



జాతీయస్థాయి జూనియర్ ఉమన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పి.ముజియా బేగం లెఫ్ట్ పొజిషన్‌లో రాణిస్తూ నాలుగు గోల్స్‌తో రాణించింది. కేరళపై 2, కర్ణాటకతో 1, తెలంగాణతో 1 గోల్ చేసి మొత్తం నాలుగు గోల్స్ సాధించింది.

కుడి వైపు గుండె గల వ్యక్తికి అరుదైన చికిత్స



రోగి వెంకట శివతో డాక్టర్ గౌరి

కడప రూరల్ : సాధారణంగా అందరికీ గుండె ఎడమవైపు ఉంటుంది. అయితే కుడివైపు గుండెగల వ్యక్తికి వైద్యులు అరుదైన చికిత్స నిర్వహించారు. ఆదివారం కడప నగరం నాగరాజుపేటలోని శ్రీ శ్రీనివాసా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వివరాలు వెల్లడించారు. మైదుకూరు మండలానికి చెందిన 68 ఏళ్ల వయసు గల వెంకట శివ అనే రోగికి గుండెనొప్పి వచ్చింది. దీంతో బాధితుడు శ్రీ శ్రీనివాస ఆస్పత్రికి వచ్చాడు. ఆస్పత్రి వైద్య బృందం గౌరి, కోటి శ్రీనివాసులు వెంకట శివను పరీక్షించారు. ఈ పరీక్షల్లో అందరిలా గుండె ఎడమవైపు కాకుండా కుడివైపు (డెక్స్ట్రో కార్డియా) ఉందని నిర్ధారించారు. ఇది కొన్ని లక్షల మందిలో ఒకరికి మాత్రమే అరుదుగా ఉంటుందని వైద్యులు తెలిపారు. ఇతనికి ఆంజియోగ్రామ్ చేయగా బైపాస్ సర్జరీ అవసరమని గుర్తించారు. దీంతో ఈ సర్జరీని ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు తాను సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు వెంకటశివ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- విద్యార్థి దుర్మరణం
- మరో యువకుడికి తీవ్ర గాయాలు



అఫ్రోజ్ (ఫైల్)

మదనపల్లె : మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డు కనుమలో గంగమ్మగుడి వద్ద ఆదివారం సాయంత్రం బైక్‌ను లారీ ఢీకొనడంతో.. ఓ విద్యార్థి దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నిమ్మనపల్లె క్రాస్‌కు చెందిన మస్తాన్ కుమారుడు అఫ్రోజ్(22) తిరుపతిలో ఎంబీఏ చదువుతున్నాడు. అతను స్నేహితుడు, బసినికొండకు చెందిన సహదేవ కుమారుడు పవన్‌కుమార్(24)తో కలిసి ద్విచక్రవాహనంలో 150 మైలు వద్దనున్న మరో స్నేహితున్ని కలిశారు. తిరిగి ఇంటికి బయలుదేరారు. గంగమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అఫ్రోజ్ అక్కడికక్కడే మృతి చెందగా, పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తరిగిపోతున్న మొండికట్ట



జేసీబీతో మట్టిని తవ్వుతున్న దృశ్యం

చిట్వేలి : మండల పరిధి చెర్లోపల్లి సమీపంలోని మొండికట్ట మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 400 ఏళ్ల క్రితం మట్లిరాజులు ఇక్కడ భారీ చెరువు నిర్మించారు. అప్పట్లో అది తెగిపోగా దానిని మొండికట్టగా పిలుస్తున్నారు. రహదారులకు, రియల్ ఎస్టేట్, ప్రత్యేక అవసరాలకు ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తుండటంతో మొండికట్ట కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. ఆదివారం ఉద్యోగులకు సెలవు రోజు కావడంతో జేసీబీ, ట్రాక్టర్లతో మట్టిని భారీగా తరలించారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈ, తహసీల్దార్‌ను వివరణ కోరగా.. అనుమతి లేకుండా మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాడుల్లో 10 మందికి గాయాలు



గాయపడిన హరికృష్ణ

మదనపల్లె : వేర్వేరు చోట్ల జరిగిన మూడు దాడుల్లో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. వాల్మీకిపురం మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన అంజనప్ప కుటుంబ సభ్యులు శనివారం రాత్రి రాములోరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామంలో డీజే ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మండలంలోని విఠలం గ్రామానికి చెందిన కొందరు యువకులు డీజే వద్ద డ్యాన్సులు వేసే క్రమంలో గొడవపడుతుండగా అంజనప్ప వారిని మందలించి పక్కకు పంపేశారు. అయితే యువకులు అంజనప్పపై తిరగబడటంతో గొడవ జరిగింది. స్థానికులు ఇరువర్గాల వారికి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఇదిలావుండగా ఆదివారం విఠలంకు చెందిన కిషోర్, ప్రతాప్, రాజు, చంటి, మరికొందరు కలిసి ఇందిరమ్మ కాలనీకి చేరుకుని అంజనప్ప కుటుంబీకులతో గొడవ పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య మాటకుమాట పెరగడంతో ఘర్షణకు దారి తీసింది. ఇందులో భాగంగా యువకులు ఆగ్రహావేశాలతో అంజనప్ప(55), ఆయన కుమారుడు హరికృష్ణ (23)పై ఇనుపరాడ్లు, కత్తులతో దాడి చేశారు. బాధితులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం బైరాజుపల్లెకు చెందిన చంద్రమోహన్(38)పై ఆర్థిక వివాద గొడవల్లో భాగంగా అదే ఊరికి చెందిన గంగిరెడ్డి కుటుంబీకులు మూకుమ్మడిగా దాడి చేశారు. అలాగే మదనపల్లె మండలం మాలేపాడుకు చెందిన చిన్న నరసింహులు, చెన్నప్ప కుటుంబీకులు గ్రామంలో తాగునీటి కోసం గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో ఘర్షణ పడ్డారు. ఈ దాడిలో చిన్న నరసింహులు కుటుంబీకులు సుమ(40), ప్రకాష్ (24), చందు(22), మరో వర్గానికి చెందిన రెడ్డప్ప (60), ఈయన కుటుంబ సభ్యులు నరసింహులు (27), అశ్విని(22), శిల్ప(24) తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ నుంచి చైన్, సెల్ అపహరణ

పెనగలూరు : మండలంలోని కొండూరు దళితవాడలో శనివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు ఓ మహిళ మెడలోని తులం బంగారు చైను, ఆమె వద్ద ఉన్న విలువైన సెల్‌ఫోన్‌ను అపహరించారు. ఎస్ఐ హేమాద్రి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండూరు దళితవాడ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు జరుగుతుండగా సింధు కుటుంబంలోని సభ్యులందరూ వెళ్లి చూసి వచ్చిన తర్వాత.. అర్ధరాత్రి సమయంలో ఇంటి ముగింట నిద్రిస్తున్నారు. సింధు మెడలోని చైన్‌ను కత్తిరించి లాక్కొని, ఆమె పక్కనే ఉన్న సెల్‌ఫోన్‌ను కూడా అపహరించారు. మహిళ కేకలు వేయగా చుట్టు పక్కల ప్రజలు దొంగల ఆచూకీ కోసం ప్రయత్నించినా ప్రయోజనం కనిపించడం లేదు. బాధిత మహిళ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.